ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఎస్పీ కార్యాలయానికి ఆరు ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 : ఎస్పీ కార్యాలయానికి సోమవారం ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. న్యాయం చేయాలని 2 ఫిర్యాదులు, భూమి పంచాయతీకి సంబంధించి 3 ఫిర్యాదులు, భార్యభర్తల మధ్య గొడవకు సంబంధించి ఒక ఫిర్యాదు అందాయి.

ఈద్గాల వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

● కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం

ఈద్గాలవద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం

కల్వకుర్తి, ఏప్రిల్ 8 : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగుచర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం సూచించారు. సోమవారం పట్టణంలోని ఈద్గాలను మున్సిపల్ వైస్‌చైర్మన్ షాహెద్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఈద్గాల కమిటీ సభ్యులు తాహెర్‌అలీ, జాహెద్, ఫారుఖ్, అశ్వక్, ఖాదర్, ముజీబ్, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలి

● ఎంపీపీ రాధాజంగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాధాజంగయ్య

ఊర్కొండ, ఏప్రిల్ 8 : గ్రామాల్లో తాగునీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రాధజంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామ కార్యదర్శులకు ఆమె తగుసూచనలు చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎండలు పెరగనుండడంతో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశానికి తాసీల్దార్ చిన్నకిష్ట ప్ప, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో, వెంకటేశ్వర్లు, కోఆప్షన్ కలీంపాషా, ఎంపీటీసీ గోపాల్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

● జిల్లా ఉపవైద్యాధికారి తారాసింగ్

దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారి

ఉప్పునుంతల,ఏప్రిల్ 8 : ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించి ప్రభుత్వ దవాఖానపై ప్రజలకు పూర్తిగా నమ్మకం కలిగేవిధంగా అంకితభావంతో విధులను నిర్వర్తించాలని జిల్లా ఉపవైద్యాధికారి తారాసింగ్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందిచే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎండలతీవ్రత ఎక్కువగా ఉన్నందున వైద్యసిబ్బంది 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమాకాంత్, ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, స్టాఫ్‌నర్సులు వెంకటమ్మ,రేణమ్మ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంతాగి వాహనాలు నడపరాదు

లింగాల,ఏప్రిల్ 8 : మద్యంతాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై జగన్‌మోహన్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్‌చౌరస్తాలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు ఉగాది పర్వదినాన్ని సామరస్యంగా జరుపుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రూ.50 వేలకు మించి డబ్బులు తీసుకెళ్లొద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున్న ఎలాంటి అలజడులు లేకుండా ఉండాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రామస్వామి ఆశయాలను కొనసాగిస్తాం

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 8 : సాయుధ రైతాంగ పోరాటయోధుడు కామ్రేడ్ కందికొండ రామస్వామి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కా ర్యాలయంలో రామస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్మించడంలో రామస్వామి కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, యాదయ్య, మోహన్, నర్సింహ, వెంకటస్వామి, మనోహర్ ఉన్నారు.

కూలీలకు ఓటుహక్కుపై అవగాహన

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 8 : మండలంలోని ము ష్టి పల్లి, మరికల్, చంద్రకల్, వెన్నచర్ల గ్రామాల్లో ఉపాధి హామీ పనులను డీఆర్డీఏ ఓబులేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎండలు తీవ్రంగా ఉన్నాయని, కూలీలు ఉదయంవేళల్లో పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం ముష్టిపల్లిలో ఓటుహక్కుపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు రామ్మోహన్‌రెడ్డి, నటరాజ్, పంచాయతీ కార్మికులు తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

● సమయపాలన తప్పనిసరిగా పాటించాలి కలెక్టర్ ఉదయ్‌కుమార్
● కలెక్టరేట్‌లోని కార్యాలయాల ఆకస్మిక తనిఖీ
● చెప్పకుండా విధులకు గైర్హాజరైన ఉద్యోగికి మెమో జారీ

కార్యాలయాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 : ఉద్యోగులు, సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మొదటి, రెండో అంతస్తులోని కార్యాలయాలను కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శాఖల వారీగా అధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమగ్ర శిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ సుజాత విధులకు గైర్హాజరు కావడంపై సదరు ఉద్యోగికి మెమో జారీ చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో, ఉద్యానశాఖ, డీపీవో, డీటీడబ్ల్యువో, డీఎస్‌వో, డీఈవో, సివిల్ సప్లయ్, మిషన్ భగీరథ, డీసీవో, ఎస్సీ వెల్ఫేర్ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ తదితర శాఖలను కలెక్టర్ తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యాలయాలతోపాటు, పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సీపీవో భూపాల్‌రెడ్డి, కలెక్టరేట్ డీటీ బాలరాజు, పీఎస్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి : కలెక్టర్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 : లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతలపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి అధ్యక్షతన నిర్వహించారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట పీవో, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధులు, ఈవీఎం యంత్రాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. 2,417 మంది శిక్షణకు హాజరయ్యారన్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడంపై సమీక్షించారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే నోటీసు బోర్డులు, ఫారం-7లో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రదర్శించాలని, ఓటర్లకు అవసరమైన సాయం అందించడానికి బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్ బుక్‌లోని సూచనల ప్రకారం అన్ని పత్రాలను సీల్ చేయాలని సూచించారు. అనంతరం పోలింగ్ సిబ్బంది గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన కొన్ని లోటుపాట్లను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భోజన సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, శిక్షణ నోడల్ అధికారి గోపాల్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

చారకొండలో రూ.2.32లక్షలు పట్టివేత

పట్టుబడిన నగదుతో ఎస్సై రాజశేఖర్

చారకొండ, ఏప్రిల్ 8 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో నల్లగొండ-నాగర్‌కర్నూల్ అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎంలో రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తమల్లోనిగూడెంకు చెందిన పాలకృష్ణ నల్లగొండ జిల్లా మాల్ నుంచి డిండికి వెళ్తుండగా అతనివద్ద రూ.2,32,400 నగదు లభ్యమయ్యాయి. ఆ నగదుకు ఎలాంటి ఆధారాలు లేనందు వల్ల ఎన్నికల నియమావళి ప్రకారం నగదు సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం రవాణా మార్గంలో ఒక వ్యక్తి వద్ద రూ.50వేలు కంటే ఎక్కువగా ఉన్నట్లయితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో హెచ్‌సీలు శ్రీనివాసులు, శ్రీశైలంతో పాటు పీసీలు భాస్కరాచారి, మల్లేశ్, జంగయ్య ఉన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 8 : మండలంలోని మరికల్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.33లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్ త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం, హబీబ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం

కొల్లాపూర్, ఏప్రిల్ 8 : దళిత మేధావి, ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని ప్రజా సేవ చేయాలన్న తలంపుతో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ సోమవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ నుంచి ఖమ్మం జిల్లాకు చెందిన మల్లురవిని ఎంపీ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వడంతోనే ఓటమి ఖరారైందన్నారు. వలసవాదులకు హస్తం పార్టీ టికెట్ ఇచ్చిందని, వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

వేతనాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తాం

కోడేరు, ఏప్రిల్ 8 : గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని, వెంటనే చెల్లించాలని ఎంపీడీవోకు కార్మికులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కోడేరు పంచాయతీలో 15మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నామని, మూడునెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించకుంటే ఈ నెల 11వ తేదీ నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

పాఠశాలలో ముందస్తు ఉగాది

ఉగాది పచ్చడిని ప్రత్యక్షంగా తయారు చేస్తున్న ఉపాధ్యాయుడు

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 8 : పట్టణంలోని ఎస్వీఆర్ గ్రామర్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తుగా ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. సంప్రదాయ పద్ధతిలో ఉపాధ్యాయులు వస్త్రాలు ధరించి పలువురిని అలరించారు. మట్టి పాత్రలలో మామిడికాయలు, వేపఆకులు, చిగుర్లు పులుపు, కారం, చేదు, వగురు, తీపి, కాషాయం కలిపి ఉగాది పచ్చడిని తయారుచేసి అందరూ రుచిచూశారు. విద్యార్థులకు ఉగాది పండుగ విశిష్టత, పచ్చడి తయారు విధానం తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ శేఖర్, ఉపాధ్యాయులు షరీన్, రామస్వామి, రేణయ్య, సురేందర్ పాల్గొన్నారు.

ఉగాది పచ్చడిపై అవగాహన

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 8 : నియోజకవర్గంలోని నడింపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఉగాది పచ్చడిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీశైలం పచ్చడి యొక్క విశిష్టతను వివరించారు. శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ క్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలికారు. పచ్చడి తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా తయారు చేసి వివరించారు. షడ్రుచులైన చేదు, తీపి,వగరు, పులుపు, ఉప్పు, కారంల సమ్మిళితమని తెలిపారు. అదేవిధంగా జీవితంలో కూడా సుఖదుఃఖాలుంటాయని, సంతోషాలు ఉన్నప్పుడు పొంగిపోకూడదని, బాధలు చుట్టుముట్టాయని కుంగిపోకూడదనే జీవిత సత్యాన్ని విద్యార్థులకు వివరించారు. పచ్చడిలో ఉపయోగించే పదార్థాలు అన్ని కూడా ఆరోగ్యానికి ఎంతో మంచిదని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

● రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్


వీసీలో మాట్లాడుతున్న డీఎస్ చౌహాన్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8: జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సీఎంఆర్ బియ్యం సరఫరాపై సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సీతారామారావు మాట్లాడుతూ.. జిల్లాలో లక్ష 10మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు అంచనా వేశామని, అందుకుగానూ జిల్లా వ్యాప్తంగా అన్ని వసతులతో 199 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 27లక్షల 50వేల గన్నీ బ్యాగులు అవసరం కాగా, జిల్లాలో 23,72,500 గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన 49వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని గడువులోగా ఎఫ్‌సీఐకి అందించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, సివిల్ సప్లయ్ డీఎం బాలరాజు పాల్గొన్నారు.

రూ. 3.80 లక్షలు పట్టివేత

వెల్దండ, ఏప్రిల్ 9 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలీసులు సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన తుల్జారాంజీ అనే వ్యక్తి తన వాహనంలో రూ. 3.80 లక్షల నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

ప్రభోత్సవంలో స్వామిఅమ్మవార్లు

నందివాహనంపై ఆదిదంపతులు

శ్రీశైలం. ఏప్రిల్ 8 : శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు అంబరానంటుతున్నాయి. సోమవారం ఉదయం స్వామిఅమ్మవార్ల విశేష పూజలు జరిగినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అత్యంత వైభవంగా ప్రభోత్సవం జరిగింది. ప్రభను వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేల సంఖ్యలో ఉన్న కన్నడ భక్తులు ప్రభను తిలకించేందుకు పురవీధుల్లోకి తరలివచ్చారు. అష్టాదశ శక్తి పీఠాల్లో ఆరోరోజైన శ్రీశైల శ్రీభ్రమరాంబ అమ్మవారు మహాసరస్వతి అలంకరణలో భక్తులను కటాక్షించింది. కన్నుల పండగగా సాగాయి.

నిత్యాన్నదానం ఒకరోజు నిలిపివేత

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 8 : ఒక రోజు నిత్యాన్నదానం నిలిపివేస్తున్నట్లు ఉమామహేశ్వర దేవస్థాన చైర్మన్ కందూరి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకొని దేవస్థానంలో పనిచేస్తున్న కొంత సిబ్బంది ఉగాది పండుగ పర్వదినాన తమ తమ సొంత గ్రామాలకు వెళ్తున్నందున ఒక్క రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఈ నెల 10వ తేదీన యధావిధిగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కావున భక్తులు దీనిని గమనించి ఆలయ కమిటీకి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, దేవస్థాన పాలకమండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 8 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఎంపీవో దేవేందర్ సూచించారు. సోమవారం మండలంలోని తర్నికల్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పైప్‌లైన్లు ఎక్కడైన లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామానికి సంబంధించిన ఆదాయ వ్యయాలను రికార్డులలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి తరలిన నాయకులు

తాడూరు, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మీటింగ్‌కు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు ఎంపీపీ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ శివలీల, నాయకులు శేఖర్‌గౌడ్, పరమేశ్వర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బాల వెంకటయ్య, కొండల్‌రావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 8 : మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. మండల కేంద్రంతోపాటు మారేపల్లి, పోతిరెడ్డిపల్లి, గొరిట, కోడుపర్తి, బవాజీపల్లి, మరికల్ గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఎం అరుణాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం రూ.2,203, గ్రేడ్-బీ రకానికి రూ.2,183లకు ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీహరి, ఏవో కమల్, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు రుద్రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉగాది వేడుకలు

అచ్చంపేట, ఏప్రిల్ 8 : శ్రీక్రోధినాయ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. పట్టణంలోని భ్రమరాంబ ఆలయంలో 10గంటలకు కలశస్థాపన, మండపారాధన, సాయంత్రం 5 గంటలకు పంచాంగ శ్రవణం, పచ్చడి వితరణ, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా పట్టణంలోని కన్యాకపరమేశ్వరి ఆలయం, మార్కెండేయ ఆలయం, ఉమమాహేశ్వరం తదితర ఆలయాల్లో సాయంత్రం పంచాంగం శ్రావణం నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ బృందం

కల్వకుర్తి, ఏప్రిల్ 8 : మండలంలోని పంజుగుల యూపీఎస్ పాఠశాలలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ బృందం రమేశ్, శ్రీధర్, శ్రీనివాస్, కిషన్, గణేశ్, కృష్ణయ్య, ఉమాదేవి పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అల్లాజీ

చారకొండ, ఏప్రిల్ 8 : తాగుడుకు బానిసై ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్సై రాజశేఖర్‌కథనం ప్రకారం గోకారం గ్రామానికి చెందిన బాదగోని అల్లాజీ (47) నిత్యం తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. క్షణికావేశంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. భార్య మల్లమ్మతో పాటు ఇద్దరూ కుమారులు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి దవాఖానకు తరలించినట్లు ఎస్సై చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి

బిజినపల్లి, ఏప్రిల్ 8 : కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని బోయాపూర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు కథనం ప్రకారం.. బోయపూర్‌కు చెందిన లింగయ్య తోటలో ఉన్న గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో ఆరుగొర్రెలు మృతిచెందినట్లు తెలిపారు. వీటి విలువ రూ.70వేలకుపైగా ఉంటుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత : కేసు నమోదు

చారకొండ, ఏప్రిల్ 8 : మండలంలోని గోకారం వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఎర్రవెల్లితండాకు చెందిన నేనావత్ రాంపాల్ తన ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున పట్టుబడినట్లు ఎస్సై రాజశేఖర్ చెప్పారు. పట్టుబడిన ఇసుకట్రాక్టర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చారకొండ, చంద్రాయన్‌పల్లి, గోకారం, తుర్కలపల్లి తదితర వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

వివాహేతర సంబంధానికి మహిళ బలి

బిజినేపల్లి, ఏప్రిల్ 8 : అక్రమ సంబంధం నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన మండలంలోని వెలుగొండ గ్రామ శివారులో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి మండలం కల్వకుంటతండాకు చెందిన చిట్టెమ్మ(28)ను 2014లో వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మామిడి గ్రామానికి చెందిన రమేశ్‌తో వివాహమైంది. 2016లో చిట్టెమ్మకు అనారోగ్యం కావడంతో గర్భం తొలగించామన్నారు. భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండడంతో చిట్టెమ్మ తల్లి మోతి బిజినపల్లిలో అద్దెకు గదిని ఇప్పించి ఉండాలని సూచించింది. ఈ క్రమంలో బిజినేపల్లికి చెందిన శివ అనే యువకుడు చిట్టెమ్మకు పరిచయమై అక్రమ సంబంధానికి దారితీసింది. దీంతో భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ కావడంతో చిట్టెమ్మ జడ్చర్లలో అద్దె గదిలో ఉంచింది. ఆదివారం చిట్టెమ్మ తల్లిగారి గ్రామమైన కల్వకుంటతండాకు వెళ్లింది. తల్లి మోతి చిట్టెమ్మను ఇక్కడికెందుకొచ్చావని మందలించి వెళ్లిపోమని చెప్పగా, ఆ రోజు సాయంత్రం నుంచి ఫోన్ కలువలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా చిట్టెమ్మ వెలుగొండ శివారులో శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సై నాగశేఖర్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. శివ అనే యువకుడు చిట్టెమ్మను ఆదివారం సాయంత్రం వెలుగొండ గ్రామ శివారులోని తన పొలం వద్దకు రమ్మని ఫోన్ చేసి చెప్పాడన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి శివ చిట్టెమ్మను గొంతు నులిపి చంపినట్లు తెలిపారు. అనంతరం ఆమె మృతదేహాన్ని దుప్పటిలో కప్పి పొలంలోని పత్తి చెత్తలో దాచాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోసుమార్టం కోసం నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. మృతురాలి తల్లి మోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.